క్లుప్తంగా

పీఆర్‌సీ ఎరియర్స్ మంజూరు చేయాలి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శివయ్య భవన్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వినుకొండ సబ్ డివిజన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, దళారీ వ్యవస్థను రద్దు చేయాలని, కార్మికులకు రావల్సిన 2022 సంవత్సరం పీఆర్‌సీ ఎరియర్స్‌ను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే జానీబాషా, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, కృష్ణ, భగవాన్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో ఆధార్ క్యాంపు పరిశీలన



నాదెండ్ల: నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఆధార్ క్యాంపును శుక్రవారం ఎంపీడీవో స్వరూపరాణి పరిశీలించారు. మూడు రోజుల నుండి 67 మందికి ఆధార్‌లో మార్పు చేర్పులు చేశారు. నూతనంగా ఆధార్ నమోదు, పేరు, అడ్రస్సులో సవరణలు, సెల్‌నెంబరు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఆధార్‌కార్డు దారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ నెల 26,27,28 తేదీల్లో మరో పాఠశాలలో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): స్థానిక జాషువా కళాప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ వారి సహకారంతో బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా వారి ఆర్థిక సహాయంతో 15 మంది పేద మహిళలకు రూ.1.30 లక్షల విలువైన కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ పీవీ సురేష్‌బాబు, డీసీ చైర్మన్ గంగినేని రాఘవ, వై.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే సేవా దృక్పథం



యడ్లపాడు: ఆధ్యాత్మిక మార్గంతోనే సేవాతత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మండలంలోని సంగంగోపాలపురంలోని సూఫీ గురువు హజరత్ సైలానీ నక్షబన్దీయ బాబా రహమతుల్లా అలైహి గురుపీఠం నందు దువా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నిస్వార్థంగా పేద ప్రజలకోసం ఇలాంటి మంచి కార్యక్రమాలను చేస్తున్న కమిటీ వారిని అభినందించారు. అనంతరం ఆశ్రమం ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి



వినుకొండ(నూజెండ్ల): ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని, ట్రూ అప్ ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ బిల్లుల భారాలపై బాదుడే బాదుడు అన్న ప్రస్తుత సీఎంగా ఉన్న చంద్రబాబు తన విద్యుత్ బాదుడును ప్రజలకు చూపిస్తున్నాడని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను బిగించమని చెప్పి స్మార్ట్‌ను రద్దు చేస్తామని, మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని గతంలో నారా లోకేష్ అన్నారని, ఇప్పుడు ఇంటింటికి మీటర్లు బిగిస్తుంటే నోరు మెదపడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పెనుమాల వెంకటేశ్వర్లు, కె.హనుమంతరెడ్డి, కె.శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

• ధాన్యం ఆరబోసి.. గోతాలకెత్తి





రొంపిచర్ల మండలంలో శుక్రవారం ఉదయం వర్షపు జల్లులు కురిశాయి. సాయంత్రం మూడు గంటల వరకు ఆకాశం అంతా మేఘావృతమై వర్షం కురిసే ఛాయలు కనిపించటంతో వ్యవసాయ పనులు రైతులు నిలిపి వేశారు. సాయంత్రం మూడు గంటల నుంచి ఓ మోస్తరు ఎండ ఛాయలు కనపడి పొడి వాతావరణం నెలకొనడంతో ధాన్యం రాశులపై వర్షానికి తడవకుండా కప్పి ఉంచిన పట్టలను తొలగించారు. మెరక ప్రాంతాల్లో ఉన్న ధాన్యాన్ని కల్లాలపై ఆరతిప్పారు. కొందరు రైతులు ధాన్యాన్ని బస్తాల్లో నింపి ఇళ్లకు చేరవేసుకున్నారు. సాయంత్రం వేళ కొందరు రైతులు తమ పొలంలోని కోతకు వచ్చిన వరి పైరును హార్వెస్టింగ్ చేశారు. మొత్తానికి సాయంత్రానికి పొడి వాతావరణం నెలకొనడంతో రాశుల్లో ఉన్న ధాన్యాన్ని కల్లాలపై తెచ్చారు. రెండు రోజులుగా రాశుల్లోనే ఉన్న పచ్చి ధాన్యం కొంత మేర డ్రై అయ్యింది. మరో రెండు రోజుల పాటు కల్లాలపైనే ధాన్యం ఆరితే నాణ్యంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. –రొంపిచర్ల

పాఠశాల నుంచే పరిశోధనల పట్ల ఆసక్తి పెంచాలి



అంతరిక్ష దృశ్యాలను వీక్షిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి నుంచే పరిశోధనల పట్ల విద్యార్థులకు ఆసక్తి కలిగించాలని కే-రిడ్జి పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలలో శుక్రవారం అంతరిక్షంపై విద్యార్థులకు అవగాహన కలిగేలా ఆస్ట్రో విజన్ స్పేస్ ప్రోగ్రామ్ ద్వారా ఆకాశం, గ్రహాలు, నక్షత్రాలు, పాలపుంత తదితర పరిశోధనాత్మక అంతరిక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నాతాని మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థి దశ నుంచే సమాజానికి ఉపయోగపడే పరిశోధకులుగా తయారయ్యేందుకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కేంద్ర మానవ వనరుల శాఖ ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో అమలు చేస్తున్నదని వివరించారు. విద్యార్థి ఎదుగుదలకు పాఠ్యపుస్తకాల బోధనతో పాటు ప్రత్యక్ష పరిశీలన ద్వారా విద్యను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, అకాడమిక్ కో ఆర్డినేటర్ పుట్ట హేమంత్ పాల్గొన్నారు.

మిరపలో ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి



మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమణారెడ్డి

నరసరావుపేట రూరల్: మిరపలో కానోఫోరా ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సి.హెచ్.రమణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని పమిడిపాడులో శుక్రవారం ఆయన పర్యటించి మిరప పంటను సందర్శించారు. మిరపలో కానోఫోరా ఎండుతెగులు ఉండటాన్ని గుర్తించారు. దీని నివారణకు నత్రజని ఎరువులను నిలిపివేయాలని, తేలికపాటి తడులును ఇవ్వాలని రైతులకు సూచించారు. కొస్సైడ్ 200 గ్రాములు ఎకరానికి దానితో పాటు సూక్ష్మధాతువులు 5 గ్రాములు లీటరు నీటితో కలిపి మల్టీకే కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. క్లోరోతలోనిల్ 200 గ్రాములు లేదా అమిస్టార్ 200 మి.లీ 200 లీటర్లతో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ మందులను మార్చిమార్చి వాడడం వలన తెగులును నివారించవచ్చని తెలిపారు. అలాగే పసుపు రంగు, నీలి రంగు జిగురు అట్టలను ఎకరానికి 50 చొప్పున పొలంలో అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఉద్యాన అధికారి నవీన్‌కుమార్, ఎంపీఈవో అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఝున్ను మాస్టర్‌కు మరో అవార్డు

• 22న గుంటూరులో అందజేత

యడ్లపాడు: సొలస మండల ప్రాథమిక పాఠశాల ఎస్టీటీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ షేక్ ఝున్ను సాహెబ్‌కు మరో అవార్డు లభించింది. క్యాలిగ్రఫీలో వేలాది మందికి ఉచిత శిక్షణ ఇస్తూ.. స్వచ్ఛందంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలకు మెచ్చి కాశ్మీర్‌కు చెందిన గ్లోబల్ హ్యూమన్‌రైట్స్ ట్రస్ట్ ఝున్ను సాహెబ్‌కు ఈ ఏడాది నవంబర్ 4వ తేదీన గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిన విషయం తెలిసిందే. తాజాగా హైదరాబాద్ సిబిల్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్, గుంటూరు సుగుణా సైన్స్ అకాడమీ, నెల్లూరు సింహపురి ఖగోళ విజ్ఞాన్ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ చిపుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ అందించే ప్రతిష్టాత్మక అవార్డులను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభా, సామాజిక సేవలను అందించిన వారికి భారత మాజీ ప్రధాని డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో ఏటా ఈ అవార్డులను ఇవ్వనున్నారు. విశిష్ట సేవా పురస్కార్, సేవా పురస్కార్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన్ గురు పురస్కార్, గురు పురస్కార్, ఇన్స్పిరేషన్ విభాగాల్లో ట్రస్ట్ 14వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి అవార్డులను ఆదివారం అందించనుంది. గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో అందించే ఈ అవార్డు ప్రదానోత్సవంలో ఝున్ను మాస్టర్‌కు 'గురు పురస్కార్' కేటగిరీలో దక్కింది.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్



అవగాహన ర్యాలీలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, ఎన్ఎస్ఎస్ పీఓలు

నరసరావుపేట ఈస్ట్: ఇంధన పొదుపు అందరి బాధ్యత అని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంధన పొదుపు వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, ఇందన వనరులను కాపాడుకోవటంతో పాటు పొదుపును పాటించాలని సూచించారు. సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవటం ద్వారా దేశ సంపదను కాపాడుకోవాలని తెలిపారు. ఇంధన పొదుపు పర్యావరణ పరిరక్షణలో భాగమని గుర్తించాలని కోరారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ దత్తత గ్రామాల్లో ఇంధన వినియోగంపై ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు టి.వి.శంకరరెడ్డి, డాక్టర్ ఎ.సరళాదేవి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీ

యడ్లపాడు: అనుమతులు లేకుండా మెటల్‌లోడు రవాణా చేస్తున్న పలు వాహనాలను బోయపాలెంలో మైనింగ్ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ఆరు మెటల్, ఒక గ్రానైట్ లోడు కలిగిన వాహనాలను అధికారులు నిలుపుదల చేయడంతో లారీ డ్రైవర్లకు, అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. తమకు ఏఎంఆర్ సంస్థ ఇచ్చిన రవాణా బిల్లులు ఉన్నట్లు లారీడ్రైవర్లు వాదనకు దిగారు. స్టోన్ క్రషర్ల యాజమాన్యాల తరుపున మైనింగ్‌శాఖ ఆన్‌లైన్ పాసులు ఉంటేనే తాము పట్టుకున్న వాహనాలను వదులుతామంటూ అధికారుల చెప్పడంతో కొద్దిసేపు వాదన జరిగింది. దీంతో క్రషర్ యాజమానులు కొందరు ఒక్కొక్క దానికి రూ.6 వేల చొప్పున జరిమానా చెల్లించి తమ వాహనాలను విడిపించుకుని వెళ్లగా, మిగిలిన వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో మైనింగ్ శాఖ టీఏ కల్యాణి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయంపై వివరణకు సదరు అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు.

దేశానికి ఇంధన పొదుపు చాలా అవసరం

నరసరావుపేట: దేశానికి ఇంధన పొదుపు చాలా అవసరమని శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు సందర్భగా జిల్లా సూపరిండెంట్ ఇంజనీరు డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ ఆదేశాల మేరకే శుక్రవారం విద్యుత్ ఉద్యోగులు నిర్వహించిన ఇంధన పొదుపు అవగాహనా ర్యాలీకి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ సుబ్బారావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరావు, బులియన్ మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంటు కపిలవాయి విజయకుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు రాంబాబు, పి.ఆనందరావు, కృష్ణవీర, నాగ సురేంద్రబాబు పాల్గొన్నారు.

లోటస్ హీరో నూతన షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: స్థానిక రావిపాడు రోడ్డులో లోటస్ హీరో నూతన డీలర్ షిప్ షోరూంని శుక్రవారం నరసరావుపేట, చిలకలూరిపేట, మాచర్ల నియోజకవర్గాల శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కొనకళ్ల బుల్లయ్య బాబు, హీరో మోటోకార్ప్ సౌత్ జోన్ సర్వీస్ మేనేజర్ షాజీ, హీరో ఏరియా మేనేజర్ విజయకణ్ణన్ ప్రారంభించారు. సంస్థ అధినేతలు అడుసుమిల్లి రామారావు, జితిన్ సాయి మాట్లాడుతూ పల్నాడు జిల్లా ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో తాము లోటస్ హీరో షోరూంని ఇక్కడ ప్రారంభించటం జరిగిందని అన్నారు. పల్నాడు ప్రాంత వాసులు తమని ఆదరించాలని కోరారు. హీరో సర్వీస్ మేనేజర్ చంద్రశేఖర్, హీరో సేల్స్ మేనేజర్ అజయ్, హీరో సర్వీస్ మేనేజర్ మురారి, లోటస్ హీరో సేల్స్‌మేనేజర్ ఖలీల్, సర్వీస్ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండల పరిషత్‌కు కొత్త రథసారధులు

బొల్లాపల్లి : మండల పరిషత్‌కార్యాలయానికి సంబంధించి ఇరువురు అధికారులు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.సీతారామయ్య, ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవోగా ఎం.లక్ష్మణరావు ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో పి. సీతారామయ్య శావల్యాపురం మండలం నుంచి, ఏపీవో ఎం. లక్ష్మణరావు ఈపూరు మండలం నుంచి బొల్లాపల్లికి బదిలీ అయ్యారు. ఇరువురు అధికారులు మండల ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

చిలకలూరిపేట: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో ఆరుగురు పేద మహిళలకు జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ నార్నే జయలక్ష్మి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగించుకోండి

శావల్యాపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శుక్రవారం తెలిపారు. ఈసందర్బంగా స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏవో రామారావు మాట్లాడుతూ వరి పంట సాగు చేసుకున్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పరంగా మద్దతు 75 కేజీల బస్తా రూ. 1720 రూపాయలకు కొనుగోలు చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: గణపవరం విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా శనివారం గణపవరం పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.

రేపు సాతులూరులో ఉచిత వైద్య శిబిరం

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుంటూరు చంద్ర హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుండి వైద్య శిబిరం ప్రారంభమౌతుందని ,గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న డీఆర్‌వో

నరసరావుపేట: క్రీస్తు మార్గం అనుసరణీయం అని డీఆర్‌వో ఇ. మురళి అన్నారు. స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీలోని డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి ముళ్లపూడి వెంకటరమణ, డీసీఏవో దేవిశెట్టి శ్రీనివాసరావు, డీఎల్‌సీవో ఉదయగిరి నాగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ జె.పి.డి. టాండన్‌తో పాటు పలువురు సహకార శాఖ అధికారులు, సీనియర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్‌లు ప్యాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రకాష్‌నగర్‌లోని జీడీసీసీ బ్యాంక్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో చీఫ్ మేనేజర్ ఎస్.రమాదేవి, మేనేజర్ గూడూరి నాగేశ్వరరావు, లక్ష్మీప్రసన్న, బ్లెస్సీ, అంజిబాబు, డి. శ్రీనివాసరావు, రహీమ్, రాంబాబు, రమేష్, నవీన్, కృష్ణారెడ్డి, మాధవి పాల్గొన్నారు.

లేగదూడను చంపి పీక్కుతిన్న వీధికుక్కలు



నాదెండ్ల: గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు తీవ్రతరమౌతోంది. అధికారులు పట్టించుకోకపోవటంతో చిన్నా పెద్దా తేడా లేకుండా కుక్క కాటుకు గురౌతున్నారు. అంతేకాక లేగదూడలు, జీవాలపై కుక్కల గుంపులు దాడి చేస్తున్నాయి. గురువారం రాత్రి గణపవరం గ్రామంలోని పశువుల ఆసుపత్రి వీధిలో పెడవల్లి రామారావుకు చెందిన కొష్టంలో కట్టేసి ఉంచిన నాలుగు నెలల లేగదూడపై వీధికుక్కల గుంపు దాడి చేసి చంపి పీక్కుతిన్నాయి. రామారావు గురువారం రాత్రి 10 గంటలకు గేదెలకు మేత వేసి ఇంటికి వెళ్ళాడు. తెల్లవారుజామున 5 గంటలకు కొష్టం వద్దకు రాగా లేగదూడ కళేబరం కనిపించింది. కొష్టంలోనే కుక్కల గుంపు ఉండటంతో రైతు తరిమేశాడు. ఏడాది కాలంలో గ్రామంలో పలువురు రైతులకు చెందిన పది లేగదూడలు, మరో పది మేక గొర్రెలను కుక్కలు చంపాయి. వీధికుక్కల బెడద నుంచి కాపాడాలంటూ పంచాయతీ అధికారులను విన్నవించినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

నేడు మాజీ సీఎం వై.ఎస్.జగన్ జన్మదిన వేడుకలు

పలుచోట్ల కార్యక్రమాలు చేపట్టిన పార్టీ నాయకులు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు స్థానిక లింగంగుంట్లలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జన్మదిన వేడుకలు ప్రారంభమౌతాయన్నారు. అక్కడ కేక్ కట్‌చేసి 10 గంటలకు లింగంగుంట్లలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమాలకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: నేడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ భీమని అంకారావు శుక్రవారం తెలిపారు. మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు సారథ్యంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. శావల్యాపురంలో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద కేకు కటింగ్ కార్యక్రమంతో పాటు భారీ అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశామన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని నివాసం వద్ద ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ వేడుకల్లో అందరూ పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం గణపవరం గ్రామంలోని తులశీవనం వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాట్రు రమేష్ తెలిపారు.